ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.4 ; కనిష్ఠం 16.3

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 3 సెప్టెంబరు 2024

అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలి: కలెక్టర్

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు2: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అనుకుంటే తప్ప బయటకురాకూడదని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలతో రహదారులు దెబ్బతి న్నాయని, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, చెరువులు, కుంటలు నిండి ఉన్నాయని చెప్పారు. ప్రజలు అత్యవసరం అనుకుంటే తప్ప బయ టకు రావద్దని కోరారు. అధికారులు అప్రమత్తంగా ఉండి లోలెవల్ వంతె నలు, కాజ్వేలను పరిశీలించి వాటిపై నుంచి వాహనదారులు ప్రయాణించ కుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.





● భిక్కనూర్‌లో వరద తాకిడికి దెబ్బతిన్న వరి, సోయా పంటలు



● తెగిన రెడ్డిపేటలో దామరచెరువు కట్ట



గొట్టుముక్కులలో పంటపొలాల్లో కప్పేసిన ఇసుక దిబ్బలను చూపు తున్న రైతులు



● వరద తాకిడికి కొట్టుకుపోయిన లింగంపేటలోని నాగారం బ్రిడ్జి

ఆగని వర్షం!

- రెండురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు
- జిల్లావ్యాప్తంగా 11.9 సెం.మీ. వర్షపాతం నమోదు
- అత్యధికంగా సదాశివనగర్‌లో 24.08 సెం.మీ.ల వాన
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- భారీ వరదలతో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- భారీ వర్షాలకు వేల ఎకరాలలో నీటమునిగిన వరి,సోయా, పత్తి, మొక్కజొన్న పంటలు
- ఎగువమానేర్‌లో వ్యక్తి గల్లంతు.. కొనసాగుతున్న గాలింపుచర్యలు
- కూలిన 78 ఇళ్లు.. 17 రోడ్లు, బ్రిడ్జిలు ధ్వంసం
- ఐదు పశువులు మృత్యువాత
- నిజాంసాగర్‌లోకి పోటెత్తుతున్న వరద

కామారెడ్డి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుండ పోత వర్షం కురిసింది. గత రెండురోజులుగా ఎడతెరపు లేకుండా జిల్లావ్యాప్తంగా భారీవర్షాలు పడుతునే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో జిల్లాలో 11.9సెం.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సదాశివనగర్‌లో 24.08 సెం.మీల వర్షం కురిసింది. జిల్లాలో ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల నివాస గృహాలు సైతం భారీ వర్షాలకు కూలిపోయాయి. వరద ప్రధాన రహదారులపై ఉధృతంగా ప్రవహిస్తుండడం వరద తాకిడికి రోడ్లు కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి.భారీవర్షాలు,వరదలతో పలు మండలాల్లో వరి,మొక్కజొన్న, పత్తి, సోయా పంటలు మునిగిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. భారీవర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, ప్రాజెక్ట్‌లు, రిజర్వాయర్‌లు జలకళను సంతరించుకుంటున్నాయి. పలు చెరువులు, రిజర్వాయర్‌లు అలుగు దూకుతున్నాయి.

జిల్లాలో 11.9 సెం.మీ.ల వర్షపాతం నమోదు

జిల్లాలో ఎడతెరపు లేకుండా భారీవర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 11.9 సెం.మీల వర్షం నమోదైంది. అత్యధికంగా సదాశివనగర్‌లో 24.8 సెం.మీ.ల వర్షం కురిసింది. భారీ వర్షాలకు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలతో పాటు ఇతర గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు కాలనీలలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో 176 మందికి పునరావాసం కల్పించారు. రామారెడ్డిలో 20.7 సెం.మీ., కామారెడ్డిలో 20.3 సెం.మీ., తాడ్వాయిలో 20.8 సెం.మీ., లింగంపేటలో 20.3 సెం.మీ., గాంధారిలో 16.6 సెం.మీ., రాజంపేటలో 15.9 సెం.మీ., ఎల్లారెడ్డిలో 14.1 సెం.మీ., నాగిరెడ్డిపేటలో 13.0 సెం.మీ., భిక్కనూర్‌లో 11.5 సెం.మీ., దోమకొండలో 11.0 సెం.మీ., పాల్వంచలో 10.4 సెం.మీ., మద్నూర్‌లో 6.9 సెం.మీ., జుక్కల్‌లో 6.5 సెం.మీ., పెద్దకొడప్‌గల్‌లో 7.2 సెం.మీ., బిచ్కుందలో 6.3 సెం.మీ., బీర్కూర్‌లో 4.8 సెం.మీ., నస్రూళ్లబాద్‌లో 7.6 సెం.మీ., బాన్సువాడలో 7.8 సెం.మీ., పిట్లంలో 7.0 సెం.మీ., నిజాంసాగర్‌లో 9.7, మాచారెడ్డిలో 9.5, బీబీపేటలో 9.0, డొంగ్లిలో 5.3 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఈవర్షాకాలంసీజన్‌లో జిల్లాలో సాధారణం కంటే ఎక్కువే వర్షపాతం నమోదయినట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

కూలిన ఇళ్లు.. తెగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు

ఎడతెరపి లేని భారీ వర్షాలకు పలు పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా మండల, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా 78 ఇళ్లు కూలిపోయాయి. కామారెడ్డి పట్టణంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన బతుకమ్మకుంట, రాజనగర్, సైలాన్ బాబా కాలనీలు, టీచర్స్‌కాలనీ,వాసవినగర్, జీఆర్‌కాలనీ, కాకతీయనగర్, జన్మభూమిరోడ్డు,విద్యానగర్, రామారెడ్డిరోడ్డులు జలమయం అయ్యాయి. ఆయా మున్సిపల్ సిబ్బంది వరద నీటిని తొలగిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. దోమకొండ,పెద్దకొడప్‌గల్, ఎల్లారెడ్డి ,కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, భిక్కనూరు ,రాజంపేట తదితర మండలాల్లోను పలు ఇళ్లు భారీ వర్షాలకు కూలిపోయాయి. భిక్కనూర్ డబుల్‌బెడ్ రూంలలోకి వరద నీరు రావడం, కామారెడ్డి, ఎల్లారెడ్డి,బాన్సువాడలోని లోతట్టు ప్రాంతాల్లో జలమయం కావడంతో 176 మంది కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించిపునరావాసం కల్పించారు. మాచారెడ్డి మండలంలోని ఎగువమానేర్‌లో గల్లంతయిన శివరాములు ఆచూకి లభ్యం కాకపోవడంతో అధికారుల గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. 17 ప్రాంతాలలో వరదలకు రోడ్లు కొట్టుకుపోగా బ్రిడ్జిలు ధ్వంసం అయ్యాయి. లింగంపేట మండలం నాగారం బ్రిడ్జి వరదతాకిడికి కోతకు గురైంది. రామారెడ్డి మండలంరెడ్డిపేట దామరచెరువుకట్ట వరద తాకిడికి తెగిపోయింది.సదాశివనగర్ మండలం అమర్లబండ కల్వర్టు ధ్వంసమైంది. దోమకొండలో కామునిచెరువు బుంగపడింది. మద్నూర్‌లోని గోజేగావ్ గ్రామానికి రాకపోకలు నిలిచాయి.

వరదనీటిలో మునిగిన వేల ఎకరాల పంటలు

జిల్లాలోని భారీ వర్షాలకు వరదపోటెత్తుంది. వాగులు,వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడం చెరువులు,కుంటలు పొంగిపోర్లుతుండడం, ప్రాజెక్ట్‌ల నుంచి నీటి విడుదల చేస్తుండడతో పరివాహక ప్రాంతాల్లోని పంట చేన్లలోకి వర్షపు, వరదనీరు వచ్చి చేరి పంటలు నీటమునిగాయి. దోమకొండ, మాచారెడ్డి, బీబీపేట, భిక్కనూరు, కామారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని ప్రాంతాల్లో సుమారు 2వేల ఎకరాలలో వరి, సోయా, మొక్కజొన్న, పత్తి పంటలు వరదనీటిలో మునిగిపోవడమే కాకుండా కొట్టుకుపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్ట్‌ల్లోకి భారీగా చేరుతున్న వరద


జిల్లాతోపాటు ఎగువ ప్రాంతాన కురుస్తున్నవర్షాలతో వాగులు, వంకలు పోటెత్తుతుండడంతో చెరువులు, ప్రాజెక్ట్‌లలోకి వరద భారీగా వచ్చిచేరుతోంది. నాలుగురోజుల కిందట నీరు లేక బోసిపోయిన పోచారం, నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్ట్‌లు వరద తాకిడితో జలకళను సంతరించుకుంటున్నాయి. ఒక్కరోజు వ్యవధిలోనే పోచారం ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండుకుంది. పోచారం ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్‌లోకి 27,058 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలు కాగా 27,058 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్‌పూర్తిస్థాయి నీటిమట్టం 1.820 టీఎంసీలుకాగా అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండుకోవడంతో అలుగుపారుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తుతోంది. ప్రాజెక్ట్‌లోకి 48,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.976 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. సింగితం,కళ్యాణి రిజర్వాయర్‌లు సైతం పూర్తిగా నిండుకోవడంతో దిగువకు నీటిని విడుదలచేస్తున్నారు. జిల్లాలో సుమారు 500లకు పైగా చెరువులు నిండుకున్నాయి.

నిజాంసాగర్ ప్రాజెక్టుకు భారీ వరద

- ఎగువ ప్రాంతాల నుంచి 48, 800 క్యూసెక్కుల వరద రాక
- 9.156 టీఎంసీలకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం



జలకళను సంతరించుకున్న నిజాంసాగర్ ప్రాజెక్టు



పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు

నిజాంసాగర్, సెప్టెంబరు2: ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టుకు 48వేల 800 క్యూసెకుల వరద వస్తోంది. ప్రాజెక్టు 1405 అడుగులకు గాను 1397.82 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరుగుతుండటంతో ఉభయ జిల్లాల నుంచి పర్యాటకులు సందర్శిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పోచారం ప్రాజెక్టు నిండి పొంగుపొర్లుతూ ఉండటతో ఆ ప్రాజెక్టు నుంచి వరద నీరువచ్చి చేరుతుండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరుగుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ నుంచి వచ్చే నీటితో నిండిపోతుండటంతో ఉభయ జిల్లాల రైతాంగం హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో నిజాంసాగర్ ప్రాజెక్టు కింద లక్షా15వేల ఎకరాల సాగు భూముల్లో వరి సాగవుతోంది. మొదట్లో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. సింగీతం, కళ్యాణి రిజర్వాయర్లు నిండిపోగా ఈ రిజర్వాయర్ల నుంచి వరద నీటిని కూడా మంజీరా నది, నిజాంసాగర్ ప్రధాన కాలువలోనికి నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేస్తు న్నారు. కళ్యాణి రిజర్వాయర్‌కు ఆయకట్టు లేకపోగా మంజీర ఉప నది నుంచి వచ్చే వరద నీటిని మంజీరా నదిలోనికి గేట్లను ఎత్తి విడుదల చేస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువలోనికి 300 క్యూసెకుల నీటిని మళ్లీస్తుంటారు. కళ్యాణి, సింగీతం రిజర్వాయర్ల నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువలోనికి 800 క్యూసెకుల నీటిని విడు దల చేస్తుంటారు. నీటి ద్వారా ఆయకట్టు రైతులు చెరువులను నింపుకుని నీటిని నిల్వచేసుకుంటారు. ఇప్పటికే నిజాంసాగర్‌లో 9టీఎంసీల నీరు ఉండగా ఎగువప్రాంతాల నుంచి వస్తున్న 48వేల 800 క్యూసెకుల వరద తో నిజాంసాగర్ పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. నిజాంసాగర్ వరద నీటిని ఎప్పటికప్పుడు ఇరి గేషన్ ఛీఫ్ ఇంజనీర్‌శ్రీనివాస్‌తో పాటు బాన్సువాడ ఎస్‌ఈ, నిజాంసాగర్ ఈఈ, ఏఈలు పరిశీలిస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పర్యాటకులు కిందకు దిగకుండా చర్యలు చేపట్టాలని ఛీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు అధికారులను ఆదేశించారు.

● పొంగిపొర్లుతున్న పోచారం

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షా లతో పోచారం ప్రాజెక్టు నిండి పొంగిపొర్లుతోంది. పోచారం ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్‌ఫ్లో మొత్తం ప్రాజెక్టుకట్టపై నుంచి అలుగు పారుతూ మంజీ రా నది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళ్తోంది. ఆదివారం సాయం త్రం పోచారం ప్రాజెక్టులోకి 30వేల క్యూసెకుల ఇన్‌ఫ్లో రాగా, రాత్రి 11.30 గంటల ప్రాంతంలో 40వేలకుపైగా ఇన్‌ఫ్లో వచ్చింది. సోమవారం పోచా రం ప్రాజెక్టులో 27వేల క్యూసెకుల ఇన్‌ఫ్లో వస్తోంది. వేలాది క్యూసెకుల వరద నీరు కట్టపై నుంచి అలుగు పారుతూ నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళుతుంది. పోచారం ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20.5 అడుగులు (1.820 టీఎంసీలు) కాగా శనివారం ఉదయం వరకు ప్రాజెక్టులో కేవలం 15 అడుగుల నీరు మాత్రమే నిలువ ఉండగా, శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిపోయింది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతమైన మంచిప్ప అడవుల్లోనూ, లింగంపేట, గాంధారి తదితర మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురు స్తున్న భారీ వర్షాల కారణంగా లింగం పేట, గుండారం వాగులు వరద నీటితో ఉరకలు వేస్తున్నాయి. ఈ వాగుల ద్వారా పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా రావడంతో ఆదివారం సాయంత్రం పూర్తిస్థాయి నిం డిపోయింది. ఆదివారం సాయంత్రం నుంచి ప్రాజెక్టులోకి వస్తున్న ఇన్ ఫ్లో మొత్తం ప్రాజెక్టు కట్టపై నుంచి అలుగు పారుతూ మంజీరా నది ద్వా రా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.



పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ సింధు శర్మ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నాగిరెడ్డిపేట: ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సింధు శర్మ ప్రజలను కోరారు. పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతుండటంతో ఆమె సోమవారం పోచారం ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టును పరిశీలించారు. వర్షాలు భారీగా కురుస్తుండటంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు పూర్తిస్థా యిలో నిండి పొంగిపొర్లుతుండగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెల్ఫీలు దిగటానికి ప్రాజెక్టు వద్ద గాని, చెరువుల వద్ద గాని ఎవరూ వెళ్లవద్దని ఆమె సూచించారు. అత్యవసరం ఉంటే తప్ప ఇంటి ఉంచి బయటకు రావద్దన్నారు. పోచారం ప్రాజెక్టు నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా పరిసర ప్రాంత గ్రామ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సెల్ఫీలు దిగటానికి ప్రాజెక్టు వద్ద గాని, చెరువుల వద్ద గాని ఎవరూ వెళ్లొ ద్దని సూచించారు. పంట పొలాల వద్దకు వెళ్లే రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని కోరారు. పాత ఇళ్లు ఉన్నవారిని గుర్తించి వారికి అవ సరమైన పునరావాస కేంద్రాలలోకి వెంటనే తరలించాలని ఆమె స్థానిక పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆమెవెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, స్థానిక ఎస్సై మల్లారెడ్డి ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భవానిపేట్-పోతారం మధ్య కాజ్‌వేను మూసివేయాలి: కలెక్టర్

కామారెడిటౌన్, సెప్టెంబరు2: వరద తగ్గేవరకు భవానిపేట్-పోతారం గ్రామాల మధ్యకాజ్‌వే మూసివేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ పల్వంచ మండలంలోని భవానిపేట-పోతారం గ్రామాల మధ్య కాజ్‌వే నుంచి ప్రవహిస్తున్న నీటిప్రవాహన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాల వలన కాజ్‌వేపై నుండి ప్రమాదకరంగా నీరు పారుతుందని ఎలాంటి ప్రాణనష్టం కల్లకుండా నీటి ప్రవాహం తగ్గేవరకు ముందస్తుగా కాజ్‌వేకు ఇరువైపులా బారికేడింగ్ చేసి పోలీసుబందోబస్తు ఏర్పాటుచేయాలని తహసీల్దార్ జయంత్‌రెడ్డిని ఆదేశించారు. అంతకముందు జక్కుల చెరువు అలుగును పరిశీలించి చెరువు నుండి వచ్చేవాటర్ వలన కింది గ్రామానికి ఏమైన సమస్య తలెత్తకుండా సమస్య వస్తే స్పందించాలని ఆదేశించారు.

కామారెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.93కోట్ల నిధులు

● ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు2: కామారెడ్డి పట్టణ అభివృద్ధికి రూ.93కోట్ల నిధులతో శాశ్వత డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో అటల్‌మిష న్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మెషన్ (అమృత్) పథ కం అమలుపై అధికారులతో మాట్లాడారు. కామారెడ్డిలో అమృత్ పథకం కింద ముఖ్యమైన అప్‌గ్రేడ్‌లలో 5 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డబ్ల్యుటీపీ ఏర్పాటు, 500 కేఎల్ నుంచి 1100 కేఎల్ వరకు సామర్థ్యాలతో 9 కొత్త ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణంతో కామారెడ్డిలో శాశ్వతంగా నీటి సరాఫరా క్రమబద్ధీకరించే అవకాశం ఉంటుందన్నారు. 7220 కొత్త హెసీఎస్‌లు, 70 బల్క్‌ఫ్లో మీటర్ల ఏర్పాటుతోపాటుగా 36.4 కేఎం డీఐ పైపులైన్లు, 63.9 కేఎంహెడీపీఈ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈప్రాజెక్ట్‌లకు కేంద్రం 43శాతం, రాష్ట్రప్రభుత్వం 47శాతం, పట్టణ స్థానికసంస్థలు 10శాతం వాటాతో పను లు త్వరగా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ. డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఉన్నారు.

కొనసాగిన ప్రజావాణి కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రతీసోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ వారం కూడా కొనసాగింది. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డిడబ్ల్యువో రసూల్‌బీ, నిజామాబాద్ ఏసిబి రాజావెంకట్‌రెడ్డిలు వినతులను స్వీకరించారు.

ఎస్సారెస్పీ ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రంలో
నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి

నిజామాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో ఉత్పత్తిని మొదలు పెట్టింది. ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క యూనిట్ ద్వారా 9 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిని మొదలు పెట్టారు. ఈ జల విద్యుత్ కేంద్రంలో మొత్తం 4 యూనిట్లు ఉండగా 36 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు గత నెలలో కాకతీయ కాల్వ ద్వారా నీటిని విడుదల చేయగా అప్పటి నుంచి రోజు 2 యూనిట్ల ద్వారా 18మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిన అధికారులు సోమవారం గేట్లను ఎత్తడంతో 4 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం ఉండడం వల్ల సుమారు 7నెలల పాటు ఈ జల విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించనున్నారు. ఈ సంవత్సరం 65మిలియన్ల జల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. కాకతీయ కాల్వకు నీటి విడుదల కొనసాగినన్ని రోజులు ఈ ఉత్పత్తి కొనసాగుతుందని వారు వివరించారు.



జల విద్యుత్ యూనిట్

అమృత్ ప్రాజెక్టులపై చర్చించిన జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: నిజామాబాద్ నగరంలో అమృత్ ప్రాజెక్టుపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నిజామాబాద్‌కు చెందిన ముఖ్యమైన కాంగ్రెస్ నేతలు చర్చించారు. నగరంలో అమృత్ అమలుపై వారు చర్చించినట్లు తెలుస్తుంది. అమృత్ 2.0 పథకం కింద నీటిసరఫరా మరియు డ్రైనేజీ తదితర పనులపై సమావేశంలో చర్చించినట్లు తెలుస్తుంది. మోపాల్‌లో 8 ఎంఎల్‌డి సామర్థ్యంతో కొత్త నీటిశుద్ధి ప్లాంట్ నిర్మాణం, ఇప్పటికే అలిసాగర్ వద్ద ఉన్న ప్లాంట్ పునరుద్ధరణ, తదితర విషయాలను చర్చించినట్లు తెలుస్తుంది. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, రత్నాకర్, నగరానికి చెందిన పలువురు కార్పోరేటర్లు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు



నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ముప్పగంగారెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆయన ముఖ్యమంత్రిగా రైతులకు ఉచిత విద్యుత్, ఏకకాలంలో రుణమాఫీ చేశారని అన్నారు. జిల్లాతో ఆయనకు ఎంతో అనుబంధం ఉందని గుత్ప, అలిసాగర్ ప్రాజెక్టులు ఆయన హయాంలోనే నిర్మించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, విపుల్‌గౌడ్, సంతోష్, బొబ్బిలి రామకృష్ణ, ప్రీతమ్, సుభాష్‌జాదవ్, లవంగ ప్రమోద్, సాయిలు, సాయికుమార్, కేశరాజు, స్వామిగౌడ్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

డి50 ప్రధాన కాలువలోని చెత్త తొలగింపు



నవీపేటలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో తరుణ్

నవీపేట,సెప్టెంబరు2: నవీపేటలోని అలీసాగర్ డి50 ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తను సోమవారం గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. ఇటీవల నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి డి50 ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జేసీబీ సహాయంతో కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్ కాలువలో చెత్త తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. కాలువ పక్కనే ఉన్న వ్యాపార సముదాయాలకు చెందిన వారిలో కొందరు తమ దుకాణాల్లోని మురికి నీటిని కాలువలో కలపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత దుకాణదారుల యాజమానులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, తదితరులున్నారు.

పురాతన ఇళ్లకు నోటీసుల అందజేత


నగరంలో పురాతన ఇళ్లకు నోటీసులు అందజేసిన దృశ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 2: శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. నగరంలోని పెద్దబజార్, తదితర ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న పురాతన ఇళ్లను గుర్తించి సోమవారం నోటీసులను అందజేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున కూలిపోయే దశలో ఉన్న ఇళ్లను గుర్తించి నోటీసులను అందజేశారు. గత మూడు రోజులుగా కార్పొరేషన్ అధికారులు నగరంలో మొత్తంగా 35 పురాతన ఇళ్లకు నోటీసులు అందజేశారు. అంతేకాకుండా 60 డివిజన్‌లలో కూలిపోయే ఇళ్లను గుర్తించి వాటిని కూడా గుర్తించే పనిలో ఉన్నారు. యజమానులు సైతం సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూస్తాం


ఏర్గట్లలో రైతులతో మాట్లాడుతున్న అన్వేష్ రెడ్డి

ఏర్గట్ల, సెప్టెంబరు 2: మండలంలో కురిసన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిసర ప్రాంతాలను సోమవారం రాష్ట్ర వ్యవసాయ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు, తాళ్లరాంపూర్, దోంచంద, గుమ్మిర్యాల్‌లో దెబ్బతిన్న బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించి, పం ట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపి పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, కొరిపెల్లి లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, బద్ధం లింగారెడ్డి, రొక్కెడ తదిత రులు పాల్గొన్నారు.

● శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అన్వేష్‌రెడ్డి

మెండోర: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు చేరడంతో ప్రాజెక్టు 40వరద గేట్లను ఎత్తిగోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును రాష్ట్ర విత్తనాభివృద్ధి, సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సందర్శించారు. ఆయనకు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్ రావు గుప్త, ప్రాజెక్టు ఈఈ చక్రపాణి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద వివరాలను ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీటి విడుదల వివరాలను వివరించారు. అనంతరం అన్వేష్‌రెడ్డి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు డప్పు చాటింపు, గ్రామంలో ఉన్న మైకులలో ఎప్పటికప్పుడు గోదావరి పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. అన్వేష్‌రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తంటి ముత్యంరెడ్డి, ముప్కాల్ కిషన్‌కేత్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్, రేంజర్ల చిన్నారెడ్డి, బంగ్లా గంగారెడ్డి, పోచంపాడ్ రమేష్, తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల రక్షణ కమిటీ
రాష్ట్ర కన్వీనర్‌గా బొబ్బిలి నర్సయ్య

నిజామాబాద్‌అర్బన్, సెప్టెంబరు 2:తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయుడబ్ల్యుజే-ఐజెయు)అనుబంధంగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టు బొబ్బిలి నర్సయ్య ఎంపిక య్యారు. టీయూడబ్ల్యుజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ఉన్న బొబ్బిలి నర్సయ్యను రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. జర్నలిస్టులపై దాడులు జరిగితే పరిరక్షించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన బొబ్బిలి నర్సయ్యకు రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడంపై టియుడబ్ల్యుజే జిల్లా కమిటీ సంతోషం వ్యక్తం చేసింది.

భక్తులతో కిక్కిరిసిన సిద్ధరామేశ్వర ఆలయం

భిక్కనూరు, సెప్టెంబరు 2: మండలంలోని దక్షిణకాశీగా బాసిల్లు తున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామున నుండే ఆలయానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నాన మాచరించి క్యూలో నిలబడి స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కొడెలు కట్టి, గండదీపాలు తీసి, పుట్టువెంట్రుకలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ,సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం నుంచి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య


మృతురాలి సాయమ్మ(ఫైల్)

నవీపేట,సెప్టెంబర్2: మండలంలోని అభంగపట్నంకు చెందిన లక్క సాయమ్మ(65)అనే వృద్ధురాలు స్థానిక ఎర్రకుంట చెరువులో పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 1న ఉదయం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. సోమవారం ఆమె మృతదేహం స్థానిక ఎర్రకుంట చెరువులో లభ్యమైందని అన్నారు. మృతురాలు లక్క సాయమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండని పలు ఆసుపత్రుల చుట్టు తిరిగిన ఫలితం లేక పోవడంతో జీవితంపై విరక్తి చెంది స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి కుమార్తె స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలు చోట్ల మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి


బోధన్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నగరంలో వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 2: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ ముప్పగంగారెడ్డి మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని ఆయన ముఖ్యమంత్రిగా రైతులకు ఉచిత విద్యుత్, ఏకకాలంలో రుణమాఫీ చేశారని అన్నారు. జిల్లాతో ఆయనకు ఎంతో అనుభందం ఉందని గుత్ప, అలిసాగర్ ప్రాజెక్టులు ఆయన హయాంలోనే నిర్మించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, విపుల్‌గౌడ్, సంతోష్,బొబ్బిలి రామకృష్ణ, ప్రీతమ్,సుభాష్‌జాదవ్, లవంగప్రమోద్, సాయిలు,కేశరాజు,స్వామిగౌడ్,సృజన్,తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఇచ్చిన మాట తప్పకుండా రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, దానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శమని బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్నినిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు లాగా ఇచ్చిన మాటతప్పకుండా ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శరత్‌రెడ్డి, సాంబిరెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బాలరాం రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బ్రాహ్మరెడ్డి, రామకృష్ణరెడ్డి, ధనుంజయ్ రెడ్డి, చిన్నారెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, పాషామొయినోద్దీన్, దాము,నరేందర్‌రెడ్డి, గంగాధర్ గౌడ్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, చిరంజీవి, సురేందర్ గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

● ఆలూర్‌లో మాజీ సీఎం వైఎస్ఆర్ వర్ధంతి

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం దివంగత మాజీసీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వైఎస్.విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి, రైతుల అభివృద్ధికి ఏనలేని కృషి చేశారని వైఎస్ఆర్‌ను కొనియాడారు. ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్.రాజశేఖర్‌రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, ఉపాధ్యక్షుడు వైఎస్. మల్లారెడ్డి, ఉదయ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఆర్మూర్‌లో వైఎస్ఆర్ వర్ధంతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశే ఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహిం చారు.ఈసందర్భంగా వైఎస్. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన వ్యవసాయానికి ఉచిత కరెంటు, ఫీజు రియింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108,జలయజ్ఞం వంటి పథకాలతో ప్రజలకులబ్ధిచేకూరా యనివారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర సెక్రెటరీ బాబా ఖాన్, ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు సాయిబా బాగౌడ్, అజ్జు, మీసాల రవి, బాలకిషన్, బట్టు శంకర్, పాషా, చిక్కు, మోసీం, తదితరులు పాల్గొన్నారు.


ఆలూర్‌లో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

● మెండోరలో వైఎస్ఆర్ వర్ధంతి

మెండోర, సెప్టెంబర్2: మండల కేంద్రంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి అర్థంతరంగా నిష్క్రమించినప్పుడు ఆ నష్టాన్ని భరించటం అంత సామన్యమే కాదు జనం గుండెల్లో గుడుకట్టుకునే నాయకులు నూటికో ఒక్కరు పుడతారు జనం కోసమే తానుగా తానే జనంగా జీవించిన మనిషి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొప్పెల రమేష్, సామ నరేష్, చిన్న ముత్యం, గంగారెడ్డి, మహేందర్, గోపి, రాజారాం, దీపి, వెంకట్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సిరికొండలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాకారం రవి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసీఫ్, జీవన్‌నాయక్ మహేష్‌రెడ్డి,జీవన్,రాజ్‌కుమార్,మగ్గిడి సదానంద్,రాజేందర్‌గౌడ్,దిగంబర్, భాస్కర్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎడ్లపొలాల అమావాస్య


సాలూరలో ఎడ్లను ముస్తాబు చేసి ఊరేగిస్తున్న గ్రామస్థులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 2 :శ్రావణ మాసపు చివరి రోజుఅయిన ఎడ్ల పొలాల అమావాస్యను జిల్లా వ్యాప్తంగా రైతులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎడ్లను నూతన వస్త్రాలతో పాటు వివిధ రకాల ఆభరణాలను అలంకరించి ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్యతో సందడిగా మారాయి. గ్రామాల్లో ముస్తాబు చేసిన ఎడ్లను ఊరేగించి పూజలు చేశారు.మహిళలు సంతాన ఆయుష్షు అభివృద్ధి కోసం మట్టితో తయారు చేసిన ఎడ్లను ఉంచి వ్రతాలు చేసి వివిధ పిండివంటకాలతో నైవిద్యం సమర్పించుకున్నారు. ముత్తయిదువులకు పండ్లు, పూలతో వాయినాలు ఇచ్చుకున్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయంలో ప్రతీ పనికి రైతన్నకు చేదోడువాదోడుగా ఉండే బసవన్నలను అందంగా అలంకరించి సాయంత్రం స్థానిక అంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేయించి పూజలు చేశారు. బసవన్నలకు పిండి వంటలతో పాటు ఉలవలు, గుడాలు, బెల్లం పోలేలను తినిపించారు. మండలంలోని కోటగిరి, పొతంగల్, ఎత్తొండ, కొల్లూర్, సుంకిని గ్రామాలలో పొలాల అమావాస్యను ఘనంగా జరిపారు.

బోధన్‌రూరల్: ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలంలో రైతన్నలు ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ఆలయాల్లోని మారుతీ మందిరంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ బసవన్నలకు రంగురంగులతో అలంకరించి హనుమాన్ మందిరం చుట్టూ తిప్పడం జరిగింది. పాడిపంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు ప్రవీణ్ కుమార్, సాలూరలో పోలీస్ పటేల్, వెంకట్ పటేల్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, అల్లె రమేష్, సురేష్ పటేల్, కన్నె సాయిరెడ్డి, డిస్కో సాయిలు, శివకాంత్ పటేల్, సంజీవ్ కుమార్, లక్ష్మణ్, వీరేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతి అడుగు పెట్టడంతో రైతులు యంత్రాల సహాయంతో వ్యవసాయ పనులు చేసుకోవడంతో గ్రామాలలో ఎడ్లు మచ్చుకైనా కనిపించకుండా పోయాయి. మండలంలోని పోచారం గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పొలాల అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జాన్కంపేట్‌లో రుణమాఫీపై కుటుంబ నిర్ధారణపై సర్వే

వేల్పూర్, సెప్టెంబరు2: వేల్పూర్ మండలం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో రుణమాఫీ కాని కుటుంబసభ్యుల నిర్ధారణ సర్వేను మండల వ్యవసాయాధికారిణి శృతి ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలో ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులను గుర్తించి వారి ఇంటికి వెళ్లి దరఖాస్తులు స్వీకరిస్తూ కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేశారు. రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యులతో ఏవో శృతి సెల్ఫీ ఫోటో దిగుతూ నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు తిరుమల, వినయ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సావెల్ సొసైటీలో అక్రమాలపై విచారణ

మెండోర,సెప్టెంబరు 2: మండలంలో సావెల్ సొసైటీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం సహకార సంఘాల నోడల్ అధికారి సుమన్ సావెల్ సొసైటీకి వచ్చి కొత్తగా వచ్చిన సొసైటీ కార్యదర్శి బాధ్యతలు తీసుకోవాలని కోరగా సొసైటీకార్యదర్శి నిరాకరించాడు. ఎందుకు బాధ్యతలు తీసుకోవడం లేవని సొసైటీ కార్యదర్శిని నోడల్ అధికారి వివరణ కోరగా గతంలో సొసైటీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నట్టు ఆయనకు తెల్పి చెప్పడంతో బాధ్యతలు తీసుకోవడానికి నిరాసక్తత చూపడంతో ఈవిషయాన్ని నోడల్ అధికారి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సోమవారం డీపీవో ఆదేశాల మేరకు విచారణ అధికారి సత్యనారాయణ, అధికారుల బృందం సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టారు. దీనికి స్పందించి సొసైటీచైర్మన్ మాచర్ల రాజారెడ్డిని వివరణ కోరగా గతంలో జరిగిన అక్రమాలకు తనకు ఏలాంటి సంబంధంలేదని తన హయాంలో సొసైటీ పరిధిలోని రైతులందరికి న్యాయం చేసినట్టు పేర్కొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రాకండి: అర్బన్ ఎమ్మెల్యే



పెద్దబజార్, సెప్టెంబరు 2: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణం గా అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని ప్రజలకు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎటువంటి ఇబ్బంది ఉన్న 8309038027 నెంబర్‌కు లేదా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183కి వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

'మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్‌లు ఇవ్వడంలో కార్పొరేషన్ నిర్లక్ష్యం'

పెద్దబజార్, సెప్టెంబరు 2: మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు రెయిన్ కోట్‌లు ఇవ్వడంలో నిర్లక్ష్యం చెందిందని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు దండివెంకట్ విమర్శించారు. సోమవారం నగరంలోని సుభాష్‌నగర్‌లోగల బీఎల్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మే నెల నుంచి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ వర్షాకాలం పూర్తి కావస్తున్నా మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోర్టులు ఇవ్వడం లేదని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. మున్సిపల్ కార్మికుల మాదిరిగా అధికారులు ఒకరోజు వర్షంలో తడిచి విధులు నిర్వహిస్తే కార్మికుల బాధలు ఏంటో తెలుస్తాయని అన్నారు.

మాక్లూర్ సొసైటీలో చెక్కుల పంపిణీ

మాక్లూర్,సెప్టెంబరు 2:మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాక్లూర్‌లో మొదటి విడత రుణమాఫీ అయిన రైతులకు సోమవారం సొసైటీచైర్మన్ అశోక్‌పంపిణీ చేశారు. 54మంది సభ్యులురూ. 41 లక్షల 46వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శిప్రవీన్‌తో పాటుడైరెక్టర్లురైతులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

ఖిల్లా, సెప్టెంబరు 2: నగరంలోని 40వ డివిజన్ కార్పొరేటర్‌పై మూడవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. గత నెల చివరి వారంలో కార్పొరేటర్ శివచరణ్ తన ఇంటి ముందు నుంచి సురేష్ అనే వ్యక్తి వెళ్తున్నప్పుడు అతని అడ్డుకొని తన ఇంటి నుంచి వెళ్తావా అని అసభ్యకరంగా మాట్లాడాడు. పైగా తన తమ్ముడు ప్రమోద్‌తో కలిసి సురేష్‌పై దాడి చేశారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శాంతి కమిటీ సమావేశం

ఖిల్లా,సెప్టెంబరు 2: నగరంలోని రెండె టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల బర్కత్‌పురాలోని కమ్యూనిటీ హాల్‌లో ఎస్సై యాసిన్ అరాఫత్ శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదేశాల మేరకు రానున్న వినాయకచవితి పండుగను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారని అన్నారు. ఆయన సూచన మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇరుమతాలకు చెందిన మత పెద్దలతో సమావేశం నిర్వహించి పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు ఒకరికొకరు ప్రేమను పంచుకోవాలన్నారు.

సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితుడు

రెంజల్,సెప్టెంబరు 2:మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన ధనుంజయరెడ్డి అనే వ్యక్తి సైబర్ నేరానికి రూ.49,580 మోసపోయాడు. ఎయిర్‌టెల్ డిటీహెచ్ రీఛార్జ్‌పేరిట ఫోన్ కాల్ చేసి పుట్టిన రోజుతేదీని చెప్పుమని అనడంతో బాధితుడుపుట్టిన తేదీని చెప్పడంతో తన గూగుల్‌పే నుంచి రూ.49,580 విత్‌డ్రాఅవ్వడంతో తన ఖాతాను పరిశీలించగా ఖాతాలో డబ్బులు లేకపోవడంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించి సోమవారం రెంజల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయన్న మాట్లాడుతూ యువత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో మోసానికి పాల్పడుతున్నారని, ఎవరైనా అనవసరమైన ఫోన్ కాల్స్ వస్తే, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు చెప్పకూడదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఎల్ఐసీ వారోత్సవాలు

పెద్దబజార్, సెప్టెంబరు 2: నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల భారతీయ జీవిత భీమా సంస్థ 68వ ఆవిర్భావ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాంచ్ మేనేజర్ రాంచంద్రం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 6 వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఎల్ఐసీ సంస్థ అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని ఎల్ఐసి ప్రాముఖ్యతను తెలియజేసి సభ్యులుగా చేర్పించాలని అన్నారు. గ ఈ కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ ఏజిఎం చంద్రమౌళి, బ్రాంచ్ ఏడిఎం లక్ష్మీ, ఉద్యోగులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, క్లియ మిత్రులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి:ఎంపీ


ఎంపీ అర్వింద్

పెద్దబజార్, సెప్టెంబరు 2: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్, జగిత్యాల జిల్లా కలెక్టర్లకు ఎంపీ ధర్మపురి అర్వింద్ లేఖ రాశారు. ఇప్పటికే పలుచోట్ల రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని మరోరెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బి, పోలీస్, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఎ క్కడ కూడా ప్రాణ నష్టం జరుగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుగేట్లు ఎత్తినందున మత్స్యకారులను అప్రమత్తం చేయాలని అన్నారు. నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండా లని అవసరమైతే తప్ప బయటకు రావాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే బీజేపీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ టెన్నికాయిట్ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు2: ఆర్మూర్ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలు సోమవారం ముగిశాయి.బాలుర విభాగంలో రాము (ములుగు జిల్లా) ప్రథమ, చాణక్య (కరీంనగర్) ద్వితీయ, సాత్విక్ (ములుగు జిల్లా) తృతీయ బహుమతులను సాధించారు. బాలికల విభాగంలో కీర్తి (హైదరాబాద్) ప్రథమ, ఆనందిత (నిజామాబాద్) ద్వితీయ, రోహిణిప్రియ (ములుగు) తృతీయ బహుమతులు సాధించగా వారికి స్థానిక కౌన్సిలర్ ఫయాజ్, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మెడిదల రవిగౌడ్ నగదు బహుమతులను, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పోటీలలో సత్తా చాటిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు.ఈనెల 31నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు జమ్ము కాశ్మీర్‌లో జరగనున్న సబ్‌జూనియర్ జాతీయస్థాయి పోటీలో పాల్గొని క్రీడాకారులకు ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ కన్వీనర్ లక్ష్మీనర్సయ్య, కబడ్డీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగాధర్, టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్యామ్‌కుమార్, ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్, రాస ఆనంద్, విద్యప్రవీన్, మల్లేష్‌గౌడ్, భూపతి, మర్కంటి గంగామోహన్, శ్రీనివాస్, సంగీత రావు, రాజ్‌కుమార్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

'వాల్ నిర్మాణం చేయాలి'


సిరికొండ సబ్‌స్టేషన్‌ని సందర్శించిన సీజీఎం అశోక్ కుమార్

సిరికొండ సెప్టెంబరు 2: సబ్‌స్టేషన్‌లోకి వరద నీళ్లు చేరిన విషయం తెలుసుకున్న వరంగల్ సీజీఎం ఆపరేషన్ అశోక్ కుమార్ సోమవారం సిరికొండకు వచ్చి పరిశీలించారు. సిరికొండలో భారీవర్షాలు కురిస్తే చాలు సబ్‌స్టేషన్‌లోకి వరద నీళ్లు చేరుతాయని ఏఈ చంద్రశేఖర్, సిబ్బందితో పాటు స్థానిక గ్రామ పెద్దలు సీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. వరద నీళ్లు రాకుండా చేయించాలని ట్రాన్స్‌కో సిబ్బందితో పాటు గ్రామస్థులు చెప్పారు.సబ్‌స్టేషన్ ముందర వరద నీళ్లు వెళ్లడానికి కల్వర్టు ఉండేదని, ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ సమయంలో ఎవరు గమనించక పోవడం వల్ల వారు కల్వర్టును నిర్మించకుండా ఎత్తు పంచడం వల్ల నీళ్లు సబ్‌స్టేషన్‌లో నిలిచి పోతున్నాయని గ్రామస్థులు అన్నారు. సీజీఎం ట్రాన్స్‌కో సివిల్ పనులను పర్యవేక్షించే అధికారులతో మాట్లాడారు. 33/11 కె.వి సబ్‌స్టేషన్ . 132/33 కె.వి సబ్‌స్టేషన్‌లోకి వరద నీళ్లు రాకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సప్లయ్‌లో అంతరాయం కలిగిన, ఎక్కడైనా ఏదైనా సమస్యల ఉత్పన్నమయితే మా సిబ్బంది దృష్టికి తీసుకవస్తే పరిష్కారం చేస్తారని గ్రామస్థులకు సీజీఎం అశోక్ కుమార్ చెప్పారు. ఆయన వెంట డిచ్‌పల్లి డీఈ ఉత్తం జాడే, ఏడీఈ శ్రీనివాస్, సిరికొండ సెక్షన్ ఏఈ చంద్రశేఖర్, సిరికొండ గ్రామాభివృద్ధి సంఘం అధ్యక్షుడు జలందర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ నిరంతరం విద్యుత్ సరఫరా
● పర్యవేక్షిస్తున్న స్పెషల్ ఆఫీసర్ చీఫ్ ఇంజనీర్ అశోక్

సుభాష్‌నగర్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు వర్షంలోనూ విద్యుత్ సరఫరాను వెంటవెంటనే పునరుద్దరిస్తున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా విద్యుత్ పునరుద్దరణకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పర్యవేక్షించేందుకు వరంగల్ నుంచి చీఫ్ ఇంజనీర్ అశోక్ ప్రత్యేక అధికారిగా నియమించారు. సీఈ నగరంలోని విద్యుత్ ప్రగతిభవన్ నుంచి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పరిస్థితిని తెలుసుకుంటున్నారు. నిజామాబాద్ సర్కిల్ పరిధిలోని సిరికొండ మండలంలో 4 విద్యుత్ స్థం భాలు పడిపోయాయని, మాక్లూర్ మండలంలో మరొకటి, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయని తెలిపారు. వాటిని వెంటనే పునరుద్దరించామన్నారు. గతంలో కన్న విద్యుత్ నష్టం వాటిళ్లకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. నగరంలో టౌన్-2 ఏడిఈ తోటరాజశేఖర్ ఆధ్వర్యంలో మరమ్మతు చర్యలు ఉదయం నుంచి కొనసాగాయి.

రుద్రూర్‌లో విద్యార్థి సంఘాల ఆందోళన

● విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు ● వర్ని పోలీస్‌స్టేషన్‌కు తరలింపు


విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న దృశ్యం

రుద్రూరు,సెప్టెంబరు 2: రుద్రూరు మండల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న లింగావాడి రక్షిత గత రెండు రోజుల క్రితం హాస్టల్‌లో అనుమానస్పదంగా మృతి చెందిన విషయం విధితమే. ఆమె మృతి పట్ల సోమవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు మృతి చెందిన రక్షిత వివరాలు తెలియలేదని రుద్రూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆందోళన చేపట్టారు. సీసీ పుటేజీలో మృతురాలు వివరాలు తెలుసుకుని చెప్తామని ఇప్పటి వరకు చెప్పకపోవడం ఏమిటని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ నాయక్‌పై మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌ను పిలిపించి విద్యార్థి సంఘాల నాయకులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అయినప్పటికీ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలలో చదువుతున్న మొదటి సంవత్సరం విద్యార్థినులకు జరిగిన ఘటనపై అడిగి తెలుసుకుంటామని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ రక్షిత మృతి పట్ల ఎలాంటి విషయాలు తెలియలేదని, సీసీ పుటేజీలో కూడా ఎలాంటి వివరాలు తెలియలేదని అన్నారు. అంతలోనే పోలీసులు వారి మాట వినకుండా బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ జయేష్‌రెడ్డి, రుద్రూరు ఎస్సై సాయన్న పోలీసు బలగాలతో వారిని అడ్డుకుని అరెస్టు చేసి వర్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఆందోళనలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు నడిపింటి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ నీటిని పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: బోధన్ ఎమ్మెల్యే

నిజాంసాగర్, సెప్టెంబరు2: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఆయన నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, సామర్థ్యం ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులలో నీళ్లు లేక ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షాలు ఎంతో మేలు చేస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. హల్దీవాగు, పోచారం ప్రాజెక్టుల ద్వారా 58వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రావడంతో నిజాంసాగర్ ప్రాజెక్టు 9 టీఎంసీలకు చేరిందన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు నీటిని వృధా చేయకుండా వ్యవసాయానికి అనుగుణంగా నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాలర్లు ప్రాజెక్టులు, చెరువులోకి వెళ్లొద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, నాయకులు శంకర్ యాదవ్, అంజయ్య, మోహ, నారాగౌడ్, నీటి పారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగును పరిశీలించిన అధికారులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు2: భారీ వర్షాల కారణంగా కామారెడ్డి పెద్దచెరువు నిండి అలుగులు పారడంతో పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్,మున్సిపల్ కమీషనర్ సుజాత, మున్సిపల్ 6వ వార్డు కౌన్సిలర్ ఆకుల రూపరవికుమార్ పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప వర్షం పడేటప్పుడు బయటకు రావద్దని, వీక్షించడానికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరసన

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు2: కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. తమకు ఉద్యోగభద్రత లేకుండా పోతుందని, 9ఏళ్లుగా వైద్యవిధాన పరిషత్‌లో పని చేశామని, ప్రస్తుతం డీఎంఈ పరిధిలోకి ఆసుపత్రి మారగానే తమను విధులకు హాజరుకావద్దంటూ మెడికో ఖధు చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరిటెండెంట్ రాంసింగ్‌ను వివరణ కొరగా ఆరోగ్యశ్రీ కేసులు తగ్గుతున్నందున కావాల్సిన సిబ్బందిని మాత్రమే తీసుకోవాలని సూచనలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఏ ఉద్యోగినీ తీసేయలేదని, అవసరమున్న వారిని కొనసాగించి మిగిలిన ఉద్యోగులను ఇతర విభాగాలలో సర్దుబాటు చేసేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు2: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు. నెట్/సెట్/పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని తెలిపారు. ఇంగ్లీష్ 1,తెలుగు 1,హిస్టరి 2, ఎకనామిక్స్ 1, పొలిటికల్ సైన్స్ 1,కామర్స్ 1,ఫిజిక్స్ 1,కెమిస్ట్రి 1,బాటని 2, జువాలజీ 2 సబ్జెక్టులకుగాను ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికేట్లు జతచేసి దరఖాస్తు ఫారాలను కళాశాల కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 1 గంటల లోపు అందజేయాలని తెలిపారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్-1, హిందీ-1, ఫిజిక్స్-1, జువాలజీ -1, పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈనెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'పీఎంపీ, ఆర్ఎంపీలు క్లినిక్ బోర్డులు పెట్టకూడదు'

మాచారెడ్డిరూరల్, సెప్టెంబరు2: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీఎంపీలు, ఆర్ఎంపీలతో మండల వైద్యాధికారి డాక్టర్ ఆదర్శ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు క్లినిక్‌బోర్డు,హాస్పిటల్ అని పెట్టకూడదని, కేవలం ప్రథమ చికిత్సాలయం అని మాత్రమే బోర్డు పెట్టవలెనని తెలిపారు. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టకూడదని, మందుల చిట్టీలు వివిధ రకాల మందులు అంటిబయోటిక్స్ ఇంజెక్షన్స్ వ్రాసి ఇవ్వకూడదదని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్, మండలంలోని పీఎంపీలు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు వద్ద మొక్కు తీర్చుకున్న మాజీ జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు2: పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతుండటంతో ప్రాజెక్టువద్ద గల గంగమ్మగుడి వద్ద సోమవారం స్థానిక మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి 101 కొబ్బరికాయలు కొట్టి తన మొక్కు తీర్చుకున్నారు. మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన గంగమ్మ గుడిలో పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో తన మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిద్దయ్య, దుర్గారెడ్డి, మోతె శ్రీనివాస్, కృష్ణ, సంతోష్ గౌడ్, నారాయణ, శ్రీనివాస్, వంశీకృష్ణగౌడ్, బాబురావు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

బీర్కూర్, సెప్టెంబరు 2: మండలంలోని దామరంచ, అన్నారంబరంగేడ్డి, బీర్కూర్ గ్రామాలలో బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం కాంగ్రెస్ నాయకులు బీర్కూర్‌లో పంపిణీచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని శంకర్, డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, దొంతురాం, కాశీరాం, తదితరులున్నారు.



బసవన్నలను అలంకరించిన రైతులు



మట్టితో తయారు చేసిన ఎడ్లను పూజలు చేసిన రైతులు



బసవన్నలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్న రైతులు

ఘనంగా పొలాల అమావాస్య

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 2: జుక్కల్, పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో పొలాల అమావాస్య వేడుకలను రైత న్నలు ఘనంగా జరుపుకున్నారు. తమకు సంవత్సరంపాటు వ్యవసాయంలో సహకారం అందించే బసవన్నలకు ఉదయాన్నే చెరువులకు తీసుకెళ్లి స్నానాలు చేయించి అందమైన రంగులతో అలంకరించారు. దీంతోపాటుగానే నూతన వస్త్రాలు అలంకరించి బసవన్నల దీవెనలు తీసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే బసవన్నలకు తీపివంటకాలు చేసి వంటకాలు తినిపించిన అనంతరం మంగళహారతులు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో ఎడ్ల పొలాల అమావాస్య

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు పొలాల అమావాస్య పండుగను సోమ వారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో చివరి అమావాస్య రోజున ఈ పండుగను జరుపుకుంటారు. తెల్లవారుజాము నుంచే రైతులు ఇంటి వద్ద సందడిగా కనిపించింది. రైతులు తమవద్ద ఉన్న పశువులకు అమావాస్య రోజున వ్యవసాయపనులు పెట్టకుండా వాటిని శుభ్రం గాస్నానం చేయించి పూజించారు. పశువులకు పండుగను పురస్కరించుకుని పట్టిక బెల్లం, పానకంగా తాగించారు. సంవత్సరానిక ఒకసారి బసవన్నలను అలంకరణ చేసి కాళ్లకు గజ్జలు వేసి బాసింగాలను పెట్టి సాయంత్రం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రదక్షిణలు చేయించారు. తర్వాత రైతులు తమ బసవన్నలను ఇంటికి తీసుకెళ్లి జోడిగా వివాహకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామం లోని తమ బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

● బసవన్నలకు పూజలు

రానురాను వ్యవసాయ పనులకు యంత్రాలు రావడంతో ఎద్దులను తగ్గించుకుంటున్నారు. ఎద్దులు లేనివారు ఆనవాయితీగా పూజలు నిర్వ హించడానికి మట్టితో తయారుచేసిన బసవన్నలను పూజించారు. మండలకేంద్రంలో ఒకప్పుడు వెయ్యిఎకరాలు ఉండగా అవి నేడు పదుల సంఖ్యకు తగ్గిపోయాయి. గతంలో ఎద్దులు ఉండి పూజలుచేసిన వారుఎద్దులను విక్రయించుకోవడంతో కుమ్మరుల చేత మట్టి ఎద్దులను చేయించుకుని వాటిని పూజించారు.

వరద తాకిడికి కోతకు గురైన నాగారం బ్రిడ్జి

లింగంపేట, సెప్టెంబర్2: మండలంలో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు వాగులు, వంకలు నిండి పారుతున్నాయి. మండలంలోని పెద్దవాగు ఉధృతంగా పారడంతో నాగారం వద్ద బ్రిడ్జీ పైనుంచి వరద పారడంతో బ్రిడ్జీ కోతకు గురైంది. కోర్పోల్, నాగారం ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని అన్నారెడ్డిపల్లి వద్ద బ్రిడ్జీ కొట్టుకుపోవడంతో రోడ్డుపై నుంచి వరద పారుతోంది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అయ్యపల్లి ప్రభుస్వామి చెరువుకు గండి పడడంతో చెరువు కింద పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మాలోత్‌తండాలో పెంకుటిల్లు కూలిపోయింది. ఇప్పటికే అధికారులు గ్రామాలలో శిథిలావస్థకు చెందిన ఇళ్లలో ఉండొద్దని వారిని పునరావాసకేంద్రాలకు తరలించారు.

పొలాల్లో నిలిచిన ఇసుక దిబ్బలు

దోమకొండ రూరల్: భారీ వర్షానికి చెరువులు నిండి అలుగులు పారాయి. ఎడ్ల కట్ట వాగు ఉధృతంగా పారడంతో బీబీపేట పెద్ద చెరువు ఒక్క రోజులోనే పూర్తిస్థాయిలో నిండి మత్తడిదూకింది. లింగుపల్లి గ్రామ శివారులోని కాముని చెరువు బుంగ పడి పెద్దఎత్తున నీరు బయటకు వెళ్లింది. దీంతో ఈరిగేషన్ డీఈ అర్చన, ఏఈ బాలక్రిష్ణా, ఎంపీడీవో ప్రవీణ్, ఈవో రమేష్‌లు అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ఎడ్లకట్ట వాగు ఉధృతంగా ప్రవహించడంతో దోమకొండ శివారులోని కొంత మంది రైతుల వరి పంటలోకి ఇసుక వచ్చి చేరింది. వరి పంట మునిగిపోయింది. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం ఆరు ఇళ్లు కూలాయి. వాగులు రైతుల పొలాల్లో నుంచి పారడంతో రైతుల పైపులు, డ్రిప్‌సుట్టలు కొట్టుకుపోయాయి.

కామారెడ్డిలో కూలిన ఇల్లు

కామారెడ్డిటౌన్: ఎడతెరపి లేకుండా కురిస్తున్న భారీవర్షాల కారణంగా మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో బత్తుల స్వామి పెంకుటిల్లు గోడ కూలి ఇల్లు పూర్తిగా ధ్వంసమయ్యింది.

వర్షానికి కొట్టుకపోయిన అమర్లబండ బ్రిడ్జి

సదాశివనగర్ రూరల్: అధిక వర్షం వల్ల అమర్లబండ బ్రిడ్జి ప్రమాద స్థాయికి చేరుకుంది. గ్రామానికి ఒకేదారి ఉండడంతో ప్రతీ సంవత్సరం వర్షకాలంలో గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి వరద ఎక్కువై గ్రామానికి రాకపోకలు నిలిచిపోగా వర్షం తగ్గిన తర్వాత బ్రిడ్జి కొట్టుకపోయి చివరి అంచున మిగిలిపోయింది. రూ2కోట్ల 70 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని వార్తలు తప్ప ఇంతవరకు టెండర్లు కాక వేసిన టెండర్‌కు ఎవరు ముందుకు రాక ఇలానే ఉండిపోయిందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చొరవచూపి సత్వరమే బ్రిడ్జి నిర్మాణం చేయాలని అప్పటివరకు తాత్కలికంగా గ్రామస్తులకు రోడ్డు మరమ్మతులు చేసి రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిండుగా ప్రవహిస్తున్న లెండి వాగు

మద్నూర్: మండలంలోని గోజేగాప్, లెండివాగు నిండుగా ప్రవహిస్తుండటంతో వాగు దాటకుండా ఎటువంటి ప్రాణ నష్టం జరగరాని ఆలోచనతో అధికారులు ముల్లకంచె ఏర్పాటుచేశారు. అదేవిధంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారికి భద్రత ఏర్పాట్లు చేశారు. మద్నూర్, డోంగ్లి మండలాల్లోని ఆయా గ్రామాలకు భారీ వర్షాలతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఆయాగ్రామాల అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలను సేకరిస్తున్నారు. అదే విధంగా ఆయా గ్రామాలకు వెళ్లకుండా ట్రాక్టర్లను ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలోకి నీళ్ళు వచ్చినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. మండల స్థాయి అధికారులు ఎంపీడీవో రాణి, ఎస్సై విజయ్ కొండ, రెవెన్యూ సిబ్బంది తదితరులు గ్రామాలపై దృష్టి పెట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



పూర్తిగా కొట్టుకుపోయిన బ్రిడ్జి

కౌలాస్ నాలా ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో పరిశీలించిన అధికారులు

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్ట్ ఎగువ భాగంలో వర్షాలు కురస్తుండటంతో ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో మొదలైంది. ఇన్‌ఫ్లో వస్తుండటంతో సోమవారం ఎంపిడివో శ్రీనివాస్, ఏఈఈ రవిశంకర్‌లు వరద పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడివో శ్రీనివాస్ మాట్లాడుతు ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో వస్తుంటంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్ట్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోపై ఎంత మేరకు వస్తుందనే విషయాన్ని ఏఈఈ రవిశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సావర్‌గాంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

సావర్‌గాం గ్రామానికి చేరుకున్న ఎంపిడివో గ్రామంలో గల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. దీంతో పాటుగానే అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ రోగులకు అందిస్తున్న చికిత్సను పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నీటి ప్రవాహ ప్రాంతాలకు వెల్లకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో రాము, పంచాయితీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోచారం

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి

బాన్సువాడ, సెప్టెంబరు2: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడిన మహానేత అని ఆయన పేద ప్రజలకు ఎంతగానో సేవ చేశాడని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ రూరల్: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్ చేపట్టిన పథకాలను గుర్తుచేశారు. వైఎస్ పేదప్రజలకు ఆపద్బాంధవుడిగా నిలిచారరని కొనియాడారు.

కామారెడ్డిలో..

కామారెడ్డిటౌన్: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి ప్రభుత్వఆసుపత్రి వద్దగల ఆయనవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు 108, 104 అంబులెన్స్‌లను ఏర్పాటుచేసిన గొప్ప ప్రజానాయకుడని కొనియడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పండ్లరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎం వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు దొంతురాం కాశీరాం, రాములు, లక్ష్మీనారాయణ, సాయిలు, నబీ, లక్ష్మణ్, సాయిలు, గంగారాం, పాపయ్య పాల్గొన్నారు.



నీటమునిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అధైర్య పడొద్దు.. ఉంటాం

● వరద బాధితులకు కలెక్టర్ అశీష్‌సంగ్వాన్ భరోసా

భిక్కనూరు, సెప్టెంబరు2: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామ వరదబాధితులకు కలెక్టర్ అశీష్‌సంగ్వాన్ భరోస కల్పించారు. సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో వరద బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 45మందిని క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. కట్టుబట్టలు, ఆహారదాన్యాలు, ఇతర సమాను నీటి మునిగాయని, వర్షాలు కురిసిన ప్రతిసారి ఇదే ఇబ్బంది ఎదుర్కొంటున్నామని తమను ఆదుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఈ మేరకు అయన మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద ఉన్న సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం నీటమునిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, డీపీవో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్, సీఐ సంపత్, నాయకులు అధికారులు పాల్గొన్నారు. అలాగే భిక్కనూరు నుంచి కామారెడ్డి వరకు 44వ జాతీయరహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడాలని కలెక్టర్ ఎన్‌హెచ్ఏఐ పీడీ శ్రీనివాస్‌కు సూచించారు.

భారీ వర్షాలకు పంటలకు నష్టం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు2: గత రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాలలో పంటలు దెబ్బతింటున్నాయి. బేగంపూర్ శివారులో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట భారీ వర్షాలకు నేలకొరిగింది.

వర్షాలకు కూలిన ఇళ్లు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు2: గత రెండు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలకు ఇండ్లు కూలిపోయాయి. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు, బేగంపూర్, కాస్లాబాద్ గ్రామాలలో గల పురాతన ఇండ్లతోపాటు పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల నివాసపు ఇల్లు వర్షాలకు కూలిపోయాయి.

శిథిలావస్థకు చేరిన ఇళ్లలోని వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి: తహసీల్దార్



ఎస్సీ బాలికల వసతి గృహ ఆవరణను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 2: శిథిలావస్థకు చేరినఇళ్లలో నివాసముంటున్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహసీల్దార్ మహేందర్ కోరారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ళను ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్ పర్యటించారు. వర్షానికి కూలిన నివాసాలను పరిశీలించి, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసముంటున్న వారిని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. కూలిన ఇళ్లకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఎస్సీ బాలికల వసతి గృహం ఆవరణలో వర్షపు నీరు చేరిందని వార్డెన్ శారద సమాచారం మేరకు వెంటనే వసతి గృహనికి వెళ్లి నిలిచిన నీరుని దిగువ ప్రాంతానికి వెళ్లేలాచర్యలు చేపట్టారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వార్డెన్ శారదాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని అవసరమైతేనే బయటకు రావాలని, ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్‌స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయనవెంట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.

అధికారులు స్థానికంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలి

బాన్సువాడ, సెప్టెంబరు2: భారీవర్షాల నేపథ్యంలో అధికారులు స్థానికంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం భారీవర్షాలు కురిసిన నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీలు, డ్రైనేజీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల ప్ర భుత్వ ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని కోరారు. నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జీల దగ్గరకు ఎవరూ వెళ్లవద్దని అత్య వసరమైతే తప్ప ప్రయాణాలు చేయకండని ప్రజలకు సూచించారు. చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచండి, బయటకు రానివ్వద్దన్నారు. రైతులు తమపంట పొలాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి: సబ్ కలెక్టర్

బీర్కూర్, సెప్టెంబరు2: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బీసీ వసతి గృహం పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి వసతి గృహం సిబ్బందిని సూచించారు. సోమవారం ఆమె బీర్కూర్ మండల కేంద్రానికి విచ్చేశారు. బీసీ వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పిల్లలతో నేరుగా మాట్లాడారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం రికార్డులను, గదులను, పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ లత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	కమిటీ కుర్రాళ్లు
ప్రియా 70	ఆయ్
ప్రియా 35	ఆహో విక్రమార్క

బాన్సువాడ	
మహేశ్వరి	సరిపోదా శనివారం
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

